క్లుప్తంగా

కష్టపడకుండానే పథకాలు అందుతున్నాయి



మాకు ఆరోగ్యశ్రీ కార్డు మంజూరు కాలేదు. ఇదే విషయాన్ని మా వలంటీరు కళ్యాణికి చెప్పాం. చెప్పిందే తడవుగా ఆమె మా వివరాలను తీసుకొని ఆరోగ్యశ్రీ కార్డుకు దరఖాస్తు చేయించింది. ఇటీవల కార్డు మంజూరు కావడంతో దాన్ని ఆమే ఇంటికి తీసుకొచ్చి ఇచ్చింది. వలంటీర్ల ద్వారా ప్రజలకు శ్రమ లేకుండానే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. అదే వలంటీర్లు లేకపోతే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది.

– చప్పగంగులు, ముడిదాంపాలెం

చంద్రయాన్-3 సక్సస్ కావాలని..



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వేపాడ: చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ వేపాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రార్థనలు చేశారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) చంద్రుడి దక్షిణధ్రువంపై నీటి జాడను గుర్తించేందుకు ఉద్దేశించి ఒక రోవర్, ల్యాండర్‌ను ఈ ప్రయోగం ద్వారా పంపించిందని ఉపాధ్యాయుడు వరప్రసాద్ తెలిపారు. ప్లేగ్రౌండ్‌లో ఎల్ఎంవీ-3 రాకెట్ చిత్రాన్ని వేసి ఈ ప్రయోగం విజయవంతం కావాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

ఉద్యాన పంటల సాగు లాభదాయకం



మెరకముడిదాం: కొబ్బరిపంటను పరిశీలిస్తున్న ఏపీఓ పెదఅప్పలనాయుడు

మెరకముడిదాం: ఉద్యానవన పంటలు సాగు చేయడం ద్వారా రైతులకు మేలు చేకూరుతుందని ఉపాధిహామీ పథకం ఏపీఓ ఎస్.పెదఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని శ్యామాయవలస గ్రామంలో జి.త్రినాథ అనే రైతు ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఉద్యానవన సాగులో భాగంగా రెండు ఎకరాల్లో 120 కొబ్బరి మొక్కలను నాటాడు. వాటిని శుక్రవారం ఏపీఓ పరిశీలించారు. మొక్కల కొనుగోలుతో పాటు మూడు సంవత్సరాల పాటు వాటి సంరక్షణకు రూ.1.76 లక్షలను ప్రభుత్వం రైతుకు చెల్లిస్తుందన్నారు. ఉద్యానపంటల సాగుతో రైతులు మంచి లాభాలను ఆర్జించవచ్చన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన పంటల సాగుకు ముందుకురావాలని కోరారు.

ట్రిపుల్ ఐటీకి కేజీబీవీ విద్యార్థిని ఎంపిక



వానపల్లి ప్రమీల

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి కేజీబీవీలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థిని వానపల్లి ప్రమీల నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎస్ఓ ఎ.చంద్రకళ శుక్రవారం తెలిపారు. విద్యార్థినిని ఎస్ఓ తోపాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పశువైద్య కేంద్రం సేవలపై ఆరా



పశువైద్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ చంద్రశేఖర్

దత్తిరాజేరు: స్థానిక పశువైద్య కేంద్రాన్ని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్ శుక్రవారం సందర్శించారు. కార్యాలయ రికార్డులు, అందుబాటులో ఉన్న మందుల నిల్వలను పరిశీలించారు. పాడిరైతులకు అందిస్తున్న సేవలను డాక్టర్ అవినాష్‌ను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో పశువులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున, ఆ మేరకు రైతులను అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు టీకాలు వేయాలని సూచించారు.

రైతు ముంగిటకే సేవలు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు
- ఆర్‌బీపురంలో నూతన ఆర్‌బీకేల భవనం ప్రారంభం



ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

జామి: రైతులకు వారు ఉన్న ఊర్లోనే ప్రభుత్వ సేవలందించేందుకు వీలుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో ఆర్‌బీపురంలో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే సీఎం ఆశయమన్నారు. రైతులకు మేలు జరిగేలా రైతుభరోసా, సున్నవడ్డీ, ఉచిత పంటల బీమా తదితర అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రాయితీపై అందడంతో పాటు పండిన పంటలకు మద్దతుధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను అసలు పట్టించుకోలేదని విమర్శించారు. ఆర్‌బీకే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, ఎంపీడీఓ సతీష్, వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్, పీఆర్ డీఈ స్వామినాయుడు, స్థానిక సర్పంచ్ వర్రి కృష్ణ, ఎంపీటీసీ ముగడ నాగమణి, పలుశాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జమ్మాదేవిపేట గ్రామ సచివాలయం ప్రారంభం

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారున. గతంలో ప్రతీ పనికోసం మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు గ్రామంలోని సచివాలయానికి వెళ్తే చాలు పని జరిగిపోతుందన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎంపీడీఓ జ్ఞానేశ్వరరావు, ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, గ్రామ సర్పంచ్ బెహరా సత్యవతి, వైస్ ఎంపీపీలు ఆవాల శ్యామల, ఎం.శ్రీనురాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలుగుబిల్లిలో..

శృంగవరపుకోట: మండలంలోని అలుగుబిల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉండరాదనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అధికారులు గ్రామాల్లో గ్రామసభ నిర్వహించిన ప్రతీ సమస్యకు పరిష్కారం చూపిస్తారని చెప్పారు. సంక్షేమ పథకాలు నిరాఘాటంగా కొనసాగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలని, అందుకు ప్రజలు మద్దతివ్వాలని కోరారు. స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వాకాడ రాంబాబు, మోడీ కాశీవిశ్వనాథం, బీల వెంకటరావు, చామలాపల్లి సర్పంచ్ జుత్తాడ సూర్యారావు, రాయవరపు సత్యం, జగన్నాథం, కిలపర్తి సత్యం, వసి బంగారునాయుడు, సర్పంచ్ మంచిన శివకోటి, ఆవాల కృష్ణ, అనంత్, నారాయణమూర్తి, అప్పలసత్యం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

- ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు



సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

లక్కవరపుకోట: గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటి పరిష్కారానికి ప్రజాప్రతినిధులు కృషిచేయాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండల పరిషత్ భవనంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన ఎంపీడీఓ జి.జ్ఞానేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్సీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా శాఖల వారిగా ప్రగతి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. అలాగే గత సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన వివిధ సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను వివరించారు. రేగ గ్రామంలో రెండో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ బొడ్డు గణపతి అధికారులను కోరారు. అలాగే చందులూరు పంచాయతీ పరిధి రొంగళివానిపాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు సరిగా లేదని, దీనివల్ల విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందని ఎంపీటీసీ యడ్ల కిశోర్ సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఆవాల శ్యామల, ముదునూరు శ్రీనివాసరాజు, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలను వలంటీర్లు సమర్థిస్తారా?



సచివాలయం-3లో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వలంటీర్లు సమర్థిస్తారా అని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ ప్రశ్నించారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో సచివాలయం-2, 3లో శుక్రవారం గ్రామ వలంటీర్లు, సచివాయల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులతో 'జగనన్న సురక్ష'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిస్వార్థ సేవలందిస్తున్న వలంటీర్ల కారణంగానే మహిళలు అక్రమ రవాణా జరుగుతోందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు చాలా దుర్మార్గమని అన్నారు. దీనిపై వలంటీర్లు స్పందించాలని, పవన్ వ్యాఖ్యలను తిప్పికొట్టాలని సూచించారు. అదేవిధంగా సంతృప్తి స్థాయిలో పేదలకు ప్రభుత్వ సహకారం అందాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మంగళగిరి సుధారాణి, పార్టీ నాయకులు పతివాడ రాజారావు, గిరడ రాందాసు, సువ్వాడ అప్పలనాయుడు, ఒమ్మి రమేష్, సూరు దుర్గారావు, కరణం ఆది, మీసాల సాయి, తదితరులు పాల్గొన్నారు.

రూ.11 లక్షలతో ఆర్‌ఓ ప్లాంట్ల ఏర్పాటు



ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు ఆర్‌ఓ ప్లాంట్లను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు) శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం రూ.11 లక్షల రూపాయలతో ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ విజయకుమారి, నేతలు మండల సురేష్, కరణం ఆదినారాయణ, బెల్లాన త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గజపతినగరం పురిటిపెంట రైల్వేగేటు వద్ద ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతూ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు సీపీఎం నాయకులు జి.శ్రీనివాస్, వి.లక్ష్మి వినతి పత్రం అందజేశారు.

నువ్వులో బహుళ పంటల సాగు

జామి: మండలంలోని శిరికిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న నువ్వు పంటలో వేసిన బహుళ పంటల సాగును ప్రకృతి వ్యవసాయ విభాగం ఆర్టీఓ(రీజనల్ టెక్నికల్ అధికారి), వ్యవసాయాధికారి హేమసుందర్ శుక్రవారం పరిశీలించారు. నువ్వు సాగులో బహుళ పంటలుగా గోంగూర, తోటకూర, బెండ, బీర, ఆనప, మొక్కొజొన్న తదితర పంటలను సాగు చేయడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బహుళ పంటల సాగుతో రైతుకు అదనపు ఆదాయం లభించడంతో పాటు భూమికి కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వల్ల మొలకశాతం పెరుగుతుందన్నారు. ఐసీఆర్పీ శరణ్ తదితరులు పాల్గొన్నారు.

చోడి, కంది సాగుపై దృష్టి సారించాలి

- వ్యవసాయశాఖ ఏడీఏ కె.మహరాజన్



చోడి, కంది విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ మహరాజన్, పైడిరాజు, తదితరులు

గజపతినగరం: రైతులు వరి పంటలో పాటు చోడి, కంది, తదితర పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ ఏడీఏ కె.మహరాజన్ సూచించారు. గజపతినగరం రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు సామంతుల పైడిరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందించే రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని వివరించారు. పీఎం కిసాన్ కోసం అర్హులైన రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. అనంతరం రైతులకు ఐదు కిలోలు చొప్పున కంది, చోడి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి ధనలక్ష్మి, సీనియర్ పరిపాలనా అధికారి పప్పు సుదర్శనం, మరుపల్లి పశుసంవర్ధక శాఖ డాక్టర్ బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సేవలు మరింత చేరువ



వేపాడ: నీలకంఠరాజపురంలో ధ్రువపత్రాలు అందచేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసవు



జామి: జేడీవలసలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు



బొండపల్లి: బటివలసలో అర్జీదారుకు ధ్రువపత్రం అందచేస్తున్న ఎంపీపీ చలం నాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు, నాయకులు



గుర్ల: కోటగంట్రేడులో ధ్రువపత్రాలను అందజేస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు

ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేసేందుకు, అర్హులకు పథకాలు అందేలా చూసేందుకు ప్రభుత్వ అమలు చేస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఇప్పటికే గుర్తించిన అర్హులకు అధికారులు, ప్రజాప్రతినిధుల చేతులమీదుగా వివిధ రకాల ధ్రువపత్రాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. వేపాడ మండలం నీలకంఠరాజపురంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, జామి మండలం జేడీవలసలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పలు సాంకేతిక కారణాలతో పథకాలు పొందలేని వారికి 'జగనన్న సురక్ష'తో న్యాయం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

నేత్రదానం

కొత్తవలస: మరణానంతరం నేత్రదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని మోహిఫ్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ కృష్ణ కోరారు. మండల కేంద్రానికి చెందిన తీగెల సూర్యారావు(85) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. జీవించి ఉన్నప్పుడు ఆయన నేత్రదానం చేసేందుకు అంగీకరించడంతో ఆయన కుమారులు సన్యాసయ్యగుప్త, వెంకటప్పయ్య విశాఖపట్నంకు చెందిన మోహిషిన్ ఐబ్యాంక్‌కు సమాచారం అందించారు. ఐ బ్యాంక్ టెక్నీషియన్ కృష్ణ అక్కడకు చేరుకుని మృతదేహం నుంచి కార్నియాను సేకరించారు. ఈ సందర్భంగా అక్కడి వారికి నేత్రదానంపై ఆయన అవగాహన కల్పించారు.

దత్తిరాజేరు: మండలంలోని పెదకాద గ్రామానికి చెందిన నారాయణరావు ఇటీవల ప్రమాదానికి గురికావడంతో కుటుంబ సభ్యులు విశాఖపట్నం కేజీహెచ్‌లో చేర్పించారు. కొద్దిరోజులుగా అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. దీంతో ఆయన నేత్రాలను దానం చేయాలని మృతుని భార్య భారతి, కుటుంబ సభ్యులు నిర్ణయించుకుని, వైద్యులకు తెలియజేయడంతో వారు మృతుని కళ్ల నుంచి కార్నియాను సేకరించి భద్రపరిచినట్లు ఉపసర్పంచ్ ఈశ్వరరావు, ఎంపీటీసీ నాగిరెడ్డి సత్యం తెలిపారు.

నేడు విద్యుత్ సరాఫరా నిలిపివేత

గజపతినగరం: పట్టణంలోని 11కేవీ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు పనులతో పాటు లైన్ల మరమ్మతులు చేపట్టనుండడంతో మదుపాడ, మరుపల్లి, తమ్మారాయుడుపేట, గుమడాం, తదితర గ్రామాలకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

చిరువ్యాపారుల సాయం

వేపాడ: మండలంలో జాకేరు గ్రామానికి చెందిన ఆడారి ధనలక్ష్మి సోంపురంలో పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. ఇటీవల బాత్‌రూమ్‌లో జారిపడిపోవటంతో ఆమెకు కాలు విరిగిపోయింది. చికిత్సకు డబ్బులు లేక ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న సోంపురం జంక్షన్‌లోని వ్యాపారులు మానవత్వంతో రూ.25 వేలు సేకరించి శుక్రవారం ఆమెకు అందజేశారు. తన కష్టం చూసి స్పందించిన దాతలకు బాధితురాలు ధనలక్ష్మి కృతజ్ఞతలు తెలియజేసింది.

అంతర పంటలతో అదనపు ఆదాయం

లక్కవరపుకోట: చిరుధాన్యాల పంటలల్లో అంతర్ పంటలుగా బొబ్బర్లు, గోంగూర, తోటకూర వంటి పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం ఆర్జించవచ్చని ప్రకృతి వ్యవసాయం రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్ సూచించారు. మండలంలోని లింగంపేట క్లస్టర్ పరిధిలో మార్లాపల్లి, లచ్చింపేట గ్రామాల్లో సాగులో ఉన్న చిరుధాన్యాల పంటలను శుక్రవారం ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అంతర పంటల సాగుతో ప్రధాన పంటలకు తెగుళ్లు సోకకుండా నివారించవచ్చన్నారు.

కొత్తవలస: బీజామృతంతో విత్తనాలను శుద్ధి చేయడం ద్వారా మొలకశాతం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గోవిందరావు తెలిపారు. సబల సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని చీడివలస గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో బీజామృతం తయారీ, విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు.

దోమల నివారణకు చర్యలు

శృంగవరపుకోట: పట్టణంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలో కొట్టాం పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి ఆదేశాల మేరకు దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు సబ్‌యూనిట్ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెల్త్‌అసిస్టెంట్ టి.శంకర్, ఎంటీఎస్ రాజశేఖర్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

చీపురుపల్లి: పట్టణంలోని హడ్కోకాలనీలో జరుగుతున్న సీసీరోడ్డు పనులను వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ శుక్రవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు రూ.8 లక్షలతో సీసీరోడ్డు, ఎంపీ నిధులు రూ.10 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇలాంటి ప్రజాసంక్షేమ కార్యక్రమాలు ఎన్నడూ చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, పార్టీ నాయకులు పతివాడ రాజారావు, గిరడ రామదాసు, సూరు దుర్గారావు, ఒమ్మి రమేష్, కరణం ఆది, సువ్వాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాగులో యంత్రాల వినియోగంతో ఖర్చు ఆదా



యంత్రం వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గుర్ల: వరి విత్తనాలను నేరుగా విత్తడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని ఏడీఏ కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని కోటగంట్రేడులో శుక్రవారం రైతు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా యంత్రం సాయంతో వరి విత్తనాలను ఎలా విత్తుకోవాలో రైతులకు వివరించారు. ఇలా విత్తుకోవడం ద్వారా ఎకరాకు సుమారు రూ.15 వేలు ఆదా అవుతుందన్నారు. విత్తనాలతో పాటు ఎరువులు కూడా ఒకేసారి వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముద్దాడ కేశవరావు, వ్యవసాయ శాస్త్రవేత్త తేజేశ్వరరావు, ఏఓ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు ఉండరాదు

- జేసీ మయూర్ అశోక్



శృంగవరపుకోట: బీఎల్‌ఓలకు సూచనలు చేస్తున్న జేసీ మయూర్‌అశోక్

శృంగవరపుకోట: తప్పులు లేని కచ్చితమైన ఓటర్ల జాబితాలను రూపొందించడమే లక్ష్యంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల జాబితాల రూపకల్పన, ఇంటింటి సర్వేలో గుర్తించాల్సిన అంశాలపై శుక్రవారం ఎస్.కోట, ఎల్.కోట మండలాల బూత్‌స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో ఎక్కడా తప్పులు దొర్లకుండా బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఫోటోల డూప్లికేషన్, ఓటరు పేరు, అడ్రస్, ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు ఉండే సరిచేయాలని సూచించారు. ఒక కుటుంబంలోని సభ్యులంతా కచ్చితంగా ఒకే పోలింగ్ బూత్ పరిధిలోకి వచ్చేలా చూడాలన్నారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి ఓటుహక్కు నమోదు చేయాలన్నారు. ఈనెల 21 నుంచి ఇంటింటి సర్వే చేసి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. చనిపోయిన వారు, ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారి వివరాలను జాబితా నుంచి తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సుదర్శన్ దొర, తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ శేషుబాబు, ఎలక్షన్ టీడీలు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

దత్తిరాజేరు: బీఎల్‌ఓలు గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు జాబితాలో ఉన్న పేర్లను పరిశీలించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి సతీష్ అన్నారు. మండల పరిషత్ కార్యాయంలో తహసీల్దార్ గురుమూర్తి అధ్యక్షతన బీఎల్‌ఓలకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 21 నుంచి ఆగస్టు 21 వరకు నిర్వహించే ఈ సర్వేలో ఓటరు పేరు, ఊరు, ఫోటో ఏ ఒక్కటీ తప్పులు లేకుండా సరి చేయాలని సూచించారు. మరణించిన వారి పేర్లు కటుంబ సభ్యులకు తెలియజేసి తొలిగించాలన్నారు. కొత్తగా ఓటు నమోదుకు అవసరమైన అన్ని పత్రాలు తీసుకొని జాబితాలో పేర్లు నమోదు చేయాలని ఆదేశించారు.

వసతిగృహ విద్యార్థినుల ఆందోళన



ఎస్.కోట దేవీ జంక్షన్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థినులు

శృంగవరపుకోట: పట్టణంలోని పుణ్యగిరి రోడ్డులో ఉన్న ఎస్టీ బాలికల వసతిగృహం చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరుతూ విద్యార్థినులు డిమాండ్ చేశారు. ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. హాస్టల్ నుంచి దేవీజంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నలుగురు ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. విద్యార్థినులు స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసనకు దిగడంతో పోలీసులు వారిని విడిచిపెట్టారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థినులు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.